# కొర్ర

రాష్ట్రంలో కొర్ర సాగు విస్తీర్ణం 25 వేల ఎకరాలు. రాష్ట్రంలోని కొర్ర సాగు విస్తీర్ణం దాదాపు 70 శాతం అత్యల్ప వర్షపాత మండలంలోను మిగిలిన 30 శాతం మిగిలిన మండలాల్లో విస్తరించి ఉంది. ఎకరాకు సరాసరి దిగుబడి 252 కిలోలు.

**విత్తే సమయం :** ఖరీఫ్ : జూన్-జూలై, వేసవి : జనవరి

**నేలలు :** తేలిక నుండి నల్లరేగడి నేలలు, మురుగు నీటి పారుదలగల నేలలు

**రకాలు**

| రకం | ఋతువు | పంటకాలం (రోజుల్లో) | దిగుబడి (క్వి/ఎ) | గుణగణాలు |
|---|---|---|---|---|
| ప్రసాద్ | ఖరీఫ్, వేసవి | 70-75 | 8-12 | కంకులు పెద్దగా వుండి గింజలు లావుగా, లేత పసుపు రంగులో వుంటాయి. మొక్కలు 110 సెం.మీ. ఎత్తు పెరిగి ఆకులు వెడల్పుగా ఉండి, 3, 4 పిలకలు వేస్తాయి. |
| కృష్ణ దేవరాయ | ఖరీఫ్, వేసవి | 80-85 | 10-12 | గింజలు లావుగా, లేత పసుపు రంగులో వుంటాయి. మొక్కలు 110 సెం.మీ. ఎత్తు ఎదిగి 4-6 పిలకలు వేస్తాయి. చొప్ప నాణ్యమయినది. |
| నరసింహరాయ | ఖరీఫ్ వేసవి | 80-85 | 10-12 | గింజలు లావుగా, పసుపురంగులో వుంటాయి. మొక్కలు 110-120 సెం.మీ. ఎత్తు ఎదిగి బాగా పిలకలు వేస్తాయి. |
| శ్రీలక్ష్మి | ఖరీఫ్ వేసవి | 80-85 | 10-12 | మొక్కలు 120 సెం.మీ. ఎత్తు పెరిగి, వెర్రికంకి, తుప్పు మరియు అగ్గితెగుళ్ళను కొంత వరకు తట్టుకొంటాయి. |

**విత్తనం :** ఎకరాకు 2 కిలోలు

**విత్తటం :** విత్తనాన్ని వరసల మధ్య 22.5 మరియు మొక్కల మధ్య 7.5 సెం.మీ. దూరంలో గొర్రుతో విత్తుకోవాలి. ఎకరాకు 2 లక్షల 37 వేల మొక్కలు ఉండాలి.

**ఎరువులు :** ఎకరాకు 4 టన్నుల పశువుల ఎరువు వేసి ఆఖరి దుక్కిలో కలియ దున్నాలి. ఎకరాకు 8 కిలోల నత్రజని, 8 కిలోల భాస్వరం విత్తేటపుడు వేయాలి. నాటిన 3-4 వారాల తర్వాత పైపాటుగా మరో 8 కిలోల నత్రజనిని వేసుకోవాలి.

**అంతరపంటలు :** కొర్ర : కంది / వేరుశనగ / సోయాచిక్కుడు - 5:1, కొర్ర : వేరుశనగ - 2:1

**కలుపు నివారణ, అంతర కృషి :** విత్తిన రెండు వారాలలోపుగా ఒత్తు మొక్కలను తీసివేయాలి. విత్తిన 30 రోజుల వరకు పంట పొలంలో కలుపు మొక్కలు లేకుండా చూడాలి.

## సస్యరక్షణ

### పురుగులు

**గులాబీ రంగు పురుగు :** లార్వాలు మొవ్వును తొలిచి తినడం వలన మొవ్వు చనిపోతుంది. పూత దశలో ఆశించినట్లయితే వెన్నులు తెల్ల కంకులుగా మారుతాయి. దీని నివారణకు లీటరు నీటికి 1.6 మి.లీ. మోనోక్రోటోఫాస్ కలిపి పిచికారీ చేయాలి.

**చెదలు :** కొర్ర వేర్లను, భూమిలో ఉన్న చెదలు ఆశించటంవలన మొక్కలు వాడి చనిపోతాయి. వీటి నివారణకు చివరి దుక్కిలో ఫాలిడాల్ 2 శాతం పొడిమందును ఎకరాకు 10-12 కిలోల వంతున మట్టిలో బాగా కలిసేట్లు వేయాలి.

**మిడతలు :** ఇవి పైరు మొలకెత్తినప్పటి నుంచి ఆకుల అంచులను కొరికి నష్టం కలిగిస్తాయి. వీటి నివారణకు కార్బరిల్ 5 శాతం పొడి మందును ఎకరాకు 10-12 కిలోల చొప్పున చల్లాలి.

**కాండం తొలుచు పురుగు :** ఈ పురుగు కాండాన్ని తొలచటంవలన మొక్కలు సరిగా ఎదగక చనిపోతాయి. దీని నివారణకు లీటరు నీటికి 2 మి.లీ. ఎండోసల్ఫాన్ కలిపి రెండుసార్లు 20-30 రోజుల మధ్య పిచికారి చేయాలి.

**ఆర్మీవర్మ్ :** దీని లద్దె పురుగులు మొక్కలు పెరిగే దశలో ఆకులను, వెన్నులను కొరికి తినివేస్తాయి. దీని నివారణకు క్లోరిపైరిఫాస్ లేదా ఎండోసల్ఫాన్‌ను లీటరు నీటిలో 2 మి.లీ. కలిపి పిచికారి చేయాలి.

### తెగుళ్ళు

**తుప్పుతెగులు :** ఈ తెగులు ఒక రకమైన శిలీంధ్రం వలన కలుగుతుంది. ఆకుల మీద రెండువైపులా గోధుమ రంగు కలిగిన చిన్నచిన్న ఉబ్బెత్తు మచ్చలు ఏర్పడతాయి. ఈ మచ్చలు ఆకుతొడిమ మరియు కాండం మీద కూడా ఏర్పడతాయి. ఈ మచ్చలు ఎక్కువ అయిన ఎడల ఆకులు ఎండిపోతాయి. దీని నివారణకు లీటరు నీటికి 2.5 గ్రా. మాంకోజెబ్ కలిపి పైరుపై తెగులు కనిపించిన వెంటనే పిచికారి చేయాలి.

**అగ్గితెగులు :** ఎదిగిన మొక్కల ఆకులపై నూలు కండె ఆకారంలో మచ్చలు ఏర్పడతాయి. ఇవి ఆకులు అంతటా వ్యాపించి ఆకులు ఎండి రాలి పోతాయి. కంకికాడపై మచ్చలు ఏర్పడినపుడు కాండం విరిగి, కంకిలో తాలు గింజలు ఏర్పడుతాయి. దీని నివారణకు కాప్టాన్ లేక థైరమ్ (3 గ్రా/కిలో) విత్తనాలకు కలిపి విత్తనశుద్ధి చేయాలి. లీటరు నీటికి కార్బండజిమ్ 1 గ్రా. లేదా మాంకోజెబ్ 2.5 గ్రా. వారం రోజుల వ్యవధిలో 2 సార్లు పిచికారి చేయాలి.

**వెర్రికంకి తెగులు :** తేమతో కూడిన వాతావరణంలో ఆకుల అడుగువైపున బూజు లాంటి శిలీంధ్రం పెరుగుదల కనిపిస్తుంది. అట్టి ఆకులు ఎండి పీలికలుగా కనిపిస్తాయి. మొవ్వులోని ఆకులు సరిగా విచ్చుకోవు. మొక్క నుండి బయటకు వచ్చిన కంకులు గింజల ప్రదేశంలో ఆకుపచ్చని ఆకుల మాదిరిగా మారి కనిపిస్తాయి. దీని నివారణకు 3 గ్రా. థైరమ్ లేక కాప్టాన్ లేక మెటలాక్సిల్ కిలో విత్తనానికి కలిపి విత్తన శుద్ధి చేయాలి లేదా లీటరు నీటికి మెటలాక్సిల్ 1 గ్రా. లేదా మాంకోజెబ్ 2.5 గ్రా. కలిపి పంటపై పిచికారి చేయాలి.

సస్యరక్షణతో మంచి ఫలితాలు పొందాలంటే, ఒక ఎకరాకు 200 లీటర్ల నీటితో సిఫార్సు చేయబడిన మోతాదులో సిఫార్సు చేయబడిన క్రిమినాశక/శిలీంధ్రనాశక మందులను కలిపిన ద్రారణాన్ని పిచికారి చేయవలసివుంటుంది.

కొర్ర పంట సాగుపై మరిన్ని వివరాలకు సంప్రదించాల్సిన చిరునామా :
**ప్రిన్సిపల్ సైంటిస్ట్ (చిరుధాన్యాలు),వ్యవసాయ పరిశోధనా స్థానం, పెరుమాళ్ల పల్లె - 517 505, చిత్తూరు జిల్లా**
**ఫోన్ నెం. (0877)-2276240, సెల్ నెం. 9989625227**